## క్లుప్తంగా

### 28 నుంచి టెన్త్ పరీక్ష ఫీజు చెల్లింపులు


కుశలవదొర

మధురపూడి: పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లింపు ప్రక్రియ ఈ నెల 28 నుంచి ప్రారంభమవుతుందని కోరుకొండ ఎంఈఓ టి.కుశలవ దొర తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ వచ్చే సంవత్సరం మార్చిలో జరిగే ఈ పరీక్షలకు ఫీజు చెల్లింపు షెడ్యూల్ విడుదలైందన్నారు. మండలంలో 14 ప్రభుత్వ, 10 ప్రైవేటు పాఠశాలలున్నాయని, వీటిలో చదువుతున్న 1,261 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు.

### మద్యం వ్యాపారుల ఇష్టారాజ్యం


కాపవరంలో జాతీయ రహదారికి ఆనుకుని ఏర్పాటు చేసిన మద్యం షాపు

మధురపూడి: ప్రభుత్వం తీసుకువచ్చిన మద్యం పాలసీతో లైసెన్సుదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కనీస నిబంధనలను కూడా పట్టించుకోవడం లేదు. ఎక్కడైనా మద్యం షాపు ఏర్పాటు చేసుకోవచ్చని ప్రభుత్వం చెప్పడమే దీనికి కారణం. కోరుకొండ నుంచి విజయనగరం, భద్రాచలం వెళ్లే రహదారిని ఆనుకుని కాపవరంలో మద్యంషాపు ఏర్పాటు చేశారు. ఇది రోడ్డు టర్నింగ్ పాయింట్, చిన్నారులు ఆడుకునే పార్కు కూడా ఎదురుగా ఉంది. ఇక్కడ మద్యం షాపు ఉండడం వల్ల మందుబాబులతో స్థానికులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. కోరుకొండ మండలానికి నాలుగు మద్యం షాపులున్నాయి. వీటిలో రెండు జాతీయ రహదారికి అనుకుని ఉన్నాయి. మరొకటి గాదరాడ వెళ్లే రోడ్డుకు ఆనుకొని ఏర్పాటు చేశారు.

### ట్రాక్టర్‌తో ఢీకొన్నందుకు కేసు

సీతానగరం: మండలంలోని ముగ్గళ్లకు చెందిన మట్టాడి వెంకట రమణను ట్రాక్టర్‌తో ఢీకొట్టినందుకు జక్కల రాముపై కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ముగ్గళ్ల సొసైటీ లంక భూముల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపి ట్రాక్టర్లపై జరుగుతున్న రవాణాను సొసైటీ సెక్రటరీ వెంకట రమణ శుక్రవారం అడ్డుకున్నారు. దీంతో జక్కల రాము ట్రాక్టర్‌తో ఢీకొట్టి వెళ్లిపోయాడు. తీవ్రంగా గాయపడిన వెంకట రమణ రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### 640 మందికి వైద్యసేవలు


శిబిరంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శిబిరంలో సేవలు అందించే వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ సుధామయి మాట్లాడుతూ ఆరోగ్య ప్రాధాన్యత, వైద్యుల అంకితభావాన్ని కొనియాడారు. వైద్యులు ఎస్.రాజు, డాక్టర్ చక్రవర్తి, ధనసాయిరెడ్డి, సుధ, మేరీ ప్రశాంతి, అమర్, ఆప్తమాలజిస్టు రాజు తదితరులు సుమారు 640 మందికి గుండె, కిడ్నీలు, ఊపిరితిత్తులు, నరాలు, కళ్లు, మూత్ర సంబంధిత వ్యాధులకు వైద్యసేవలు అందించారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

### నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు


బిక్కవోలులో బాణసంచా విక్రయ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బిక్కవోలు: దీపావళి పండుగను పురస్కరించుకొని బాణసంచా విక్రయ దారులు నిబంధనలు పాటించాల్సిందేనని ఇన్‌చార్జి తహసీల్దార్ కృష్ణ అన్నారు. శనివారం ఆయన బిక్కవోలులో విక్రయాలు నిర్వహించే ప్రదేశాన్ని పరిశీలించారు. కేవలం మూడు రోజులు మాత్రమే బాణ సంచా విక్రయించుకునేందుకు అనుమతి ఉందన్నారు. ఒక దుకాణం నుంచి మరో దుకాణానికి కనీసం మూడు మీటర్ల దూరం ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్సై వాసంశెట్టి రవికుమార్ ఉన్నారు.

# ఒక్క క్లిక్.. తెగుళ్లకు చెక్

- రైతుల కోసం యాప్‌ను రూపొందించిన కేంద్రం
- తెగులు ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తే చాలు
- వ్యవసాయాధికారుల సలహాలు ప్రత్యక్షం


కాటవరంలో రైతులకు యాప్ పనితీరును వివరిస్తున్న మొక్కల సంరక్షణాధికారి వేణుబాబు

సీతానగరం: భూమిలో విత్తును నాటిన నుంచి పంట చేతికొచ్చే వరకూ రైతులు ఎంతో జాగ్రత్తగా, శ్రద్ధగా చూసుకుంటారు. ప్రతి క్షణం అప్రమత్తంగా ఉంటూ పంటను కాపాడుకుంటారు. ముఖ్యంగా పంటలను ఆశించే చీడపీడలు, తెగుళ్లపై ఆందోళన చెందుతారు. ఏదైనా తేడా అనిపిస్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారుల వద్దకో, పురుగుమందుల దుకాణాల దగ్గరికో పరుగులు పెడతారు. వారు చెప్పిన మందును పిచికారీ చేసి పంటను కాపాడుకుంటారు. అయితే ఇలాంటి సమయంలో రైతులకు ఎంతో ఉపయోగపడే యాప్‌ను కేంద్ర వ్యవసాయశాఖ అభివృద్ధి చేసింది. రైతులు తమ పొలంలో ఆశించిన చీడపీడలను ఫొటో తీసి ఈ యాప్‌లో అప్‌లోడ్ చేస్తే చాలు. అది ఏ తెగులు, దానివల్ల కలిగే నష్టమేమిటి, నివారణకు ఎలాంటి మందులు వాడాలనే విషయాన్ని యాప్ తెలియజేస్తుంది. అంటే ఈ యాప్ మీ ఫోన్ లో ఉంటే మీ దగ్గర ఓ వ్యవసాయ శాస్త్రవేత్త ఉన్నట్టే.

**ఎన్‌పీఎస్ఎస్ యాప్**

నేషనల్ పెస్ట్ సర్వేలైన్స్ సిస్టమ్ (ఎన్‌పీఎస్ఎస్) అనే ఈ యాప్‌ను కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ప్రారంభించింది. పంటలను ఆశించి చీడపీడలు, తెగుళ్లను సకాలంలో తెలుసుకుని, నివారణ చర్యలు చేపట్టడానికి ఇది చాలా ఉపయోగపడుతుంది. తెగులును వేగంగా గుర్తించడం, సకాలంలో నివారణ చర్యలు చేపట్టడం వల్ల నష్టం తక్కువగా ఉంటుంది. అలాగే తెగులు మరో పొలానికి, ప్రాంతానికి విస్తరించకుండా ఉంటుంది. దాదాపు 15 రకాల పంటలను ఆశించే కీలకమైన పురుగులు, తెగుళ్ల ఉధృతిని దీని ద్వారా అరికట్టే అవకాశం ఉంది.

**సాంకేతిక పరిజ్ఞానం**

కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్), యంత్ర అభ్యాసం (మిషిన్ లెర్నింగ్) వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే ఈ యాప్‌లో ఐడీ, పాస్‌వర్డ్ సాయంతో లాగిన్ అవ్వాలి. మీ పొలాన్ని ఆశించిన తెగులును ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. దాని నియంత్రణకు వ్యవసాయ శాస్త్రవేత్తలు సలహాలు ఇస్తారు. ఇవన్నీ ఫరిదాబాద్ డీపీపీక్యూఎస్ కార్యాలయంలోని సెంట్రల్ సర్వర్‌లో నిక్షిప్తం చేయబడతాయి. తద్వారా పంటలపై ఆశిస్తున్న తెగుళ్ల సమాచారం ప్రభుత్వానికి అందుబాటులో ఉంటుంది. ఈ యాప్‌ను ఆగస్టు 15న ఢిల్లీలో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఆవిష్కరించారు.

**డౌన్‌లోడ్ చేసుకునే విధానం**

స్మార్ట్ ఫోన్ వినియోగదారులు గూగుల్ ప్లే స్టోర్ లేదా ఐఓఎస్ ప్లేస్టోర్‌లో ఎన్‌పీఎస్ఎస్ అని టైప్ చేసిన వెంటనే ఈ యాప్ కనిపిస్తుంది. దాన్ని డౌన్‌లోడ్ చేసుకుని సులభంగా వినియోగించుకోవచ్చు. దీని ద్వారా తెగుళ్లను అరికట్టడంతో పాటు మిత్ర, శత్రు కీటకాలను కూడా గుర్తించవచ్చు. రైతులు కేవలం ఫొటో తీసి అప్ లోడ్ చేస్తే సరిపోతుంది.

**యాప్ తయారీలో కాటవరం యువకుడు**

ఎన్‌పీఎస్ఎస్ యాప్‌ను అభివృద్ధి చేసిన బృందంలో సీతానగరం మండల కాటవరానికి చెందిన బొల్లి వేణుబాబు కూడా ఉన్నారు. ఆయన కోల్‌కతాలోని బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియాలో మొక్కల సహాయక సంరక్షణాధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ ఎగ్జామినేషన్‌లో ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ (గ్రూప్ బి ఆఫీసర్) సాధించి 2021 జూన్‌లో ఉద్యోగంలో చేరారు. సొంత గ్రామమైన కాటవరానికి వచ్చిన ఆయన ఈ యాప్ వల్ల కలిగే ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. యాప్ ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి, ఫొటోలు ఎలా అప్‌లోడ్ చేయాలో వివరిస్తున్నారు.

**సత్వరమే తెగుళ్ల నివారణ**



ఎన్‌పీఎస్ఎస్ యాప్ ద్వారా తెగుళ్లను సత్వరమే నివారించవచ్చు. ఇది రైతులకు చాలా ఉపయోగంగా ఉంది. దీనిలో ఫొటో పెడితే చాలు తెగులు నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను సూచిస్తున్నారు. ఏ మందులు పిచికారీ చేయాలో చెబుతున్నారు. ఈ యాప్ రైతులందరి దగ్గర ఉండాలి.

– భజన శ్రీనివాస్, కౌలురైతు, కూనవరం

**ఎంతో ఉపయోగం**



ఎన్‌పీఎస్ఎస్ యాప్ రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది. పంటకు సోకిన పురుగులను ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తే వెంటనే నివారణ చర్యలు తెలియజేస్తారు. అలాగే మిత్ర, శత్రు కీటకాలను గుర్తించే అవకాశం కలుగుతుంది. పంటల సస్యరక్షణకు అన్ని విధాలా ఉపయోగపడుతుంది. దీని రూపకల్పనలో నేను భాగస్వామి కావడం సంతోషంగా ఉంది.

– బొల్లి వేణుబాబు, మొక్కల సంరక్షణ అధికారి, కోల్‌కత్తా బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా

### 29న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పెదపూడి: పెదపూడి మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈ నెల 29న మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నామని ఎంపీడీఓ నల్లమిల్లి నరేంద్రరెడ్డి తెలిపారు. ఎంపీపీ కేతా తులసి అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో సంబంధిత శాఖాధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటీసీ సభ్యులు హాజరు కావాలని కోరారు.

### కూటమి పాలనలో కొండలు మాయం

రాజానగరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొండలు, గుట్టలు, చెరువులు మాయమైపోతున్నాయని, ఇసుక, మట్టి మాఫియా రాజ్యమేలుతోందని కాంగ్రెస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు యాళ్ల మాచరయ్య విమర్శించారు. మండలంలోని కొత్తతుంగపాడులో జరుగుతున్న అక్రమ మైనింగ్ తవ్వకాలను తన వర్గీయులతో కలిసి శనివారం అడ్డుకునే ప్రయత్నం చేశారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, అక్రమ మైనింగ్ త్రవ్వకాలను ఆపివేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో లభించే గ్రావెల్ (ఎర్రమట్టి) నర్సరీలకు బాగా ఉపయోగపడుతుందన్నారు. ఇక్కడ నుంచి కడియం మండలంలోని నర్సరీలకు తరలిస్తారని తెలిపారు. అలాగే జి.యర్రంపాలెం, తుంగపాడు, సంపత్ నగరం, నామవరం ప్రాంతాల నుంచి కూడా మట్టి అక్రమ రవాణా జరుగుతోందనన్నారు.

### భూసర్వేలో తప్పులను సరిచేసుకోండి



కొమరిపాలెం గ్రామసభలో దరఖాస్తులు తీసుకుంటున్న రెవెన్యూ సిబ్బంది

బిక్కవోలు: మండలంలో ఇదివరకు సర్వే జరిగిన రెవెన్యూ గ్రామాల్లో ఎటువంటి తప్పులు దొర్లినా గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ కృష్ణ అన్నారు. శనివారం మండలంలోని కొమరిపాలెం గ్రామంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. 77 దరఖాస్తులు వచ్చినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో శివకుమార్ పాల్గొన్నారు.

## పోలీసు విధులపై అవగాహన అవసరం


ఆయుధాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై రవిచంద్ర


వ్యాస రచన పోటీలను పర్యవేక్షిస్తున్న ఎస్సై శ్రీను నాయక్

పెదపూడి: సమాజంలో శాంతి భద్రతలు నెలకొల్పడానికి నిరంతరం శ్రమిస్తున్న పోలీసుల విధులు, బాధ్యతలపై విద్యార్థులకు అవగాహన అవసరమని అనపర్తి ఎస్సై ఎల్.శ్రీనునాయక్ అన్నారు. పోలీసు అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా అనపర్తి బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు శనివారం నిర్వహించారు. అనంతరం బహుమతులు అందించారు.

**బిక్కవోలులో..**

బిక్కవోలు: పోలీసుల విధులు, బాధ్యతలపై ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. శనివారం బిక్కవోలు ఉన్నత పాఠశాలలో అమర వీరుల వారోత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సమాజంలో జరిగే మంచి చెడులను అంచనా వేయాలని సూచించారు. ఎపోలీసులు వినియోగించే వివిధ రకాల ఆయుధాలు వాటి పనితీరుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జంగా శ్రీనివాస్ ప్రసాద్, పీడీ ధనరాజ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## భావోద్వేగాల నియంత్రణతో విజయం


మాట్లాడుతున్న అరబిందో సొసైటీ చైర్మన్ శ్రీనివాస్

రాజానగరం: మనసులో భావోద్వేగాలను స్థిరీకరణ చేసుకోవడం ద్వారా జీవితంలో విజయాలు సాధించవచ్చని తెలుగు రాష్ట్రాలలోని అరబిందో సొసైటీ చైర్మన్ శ్రీనివాస్ ములుగు అన్నారు. గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో శనివారం 'అంతర్గత సామరస్యం – సాధన' అనే అంశంపై సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ సాధారణంగా ఒక వ్యక్తికి రోజుకు 65 వేల నుంచి 75 వేల వరకు ఆలోచనలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. మనసును ఏకాగ్రతతో కేవలం 8 సెకన్ల పాటు మాత్రమే ఒక అంశంపై కేంద్రీకరించవచ్చన్నారు. ప్రతి రోజు కనీసం 5 నిమిషాలను దీర్ఘ శ్వాస, ధ్యానానికి వెచ్చించడం ద్వారా మనసును శాంతింపజేయవచ్చన్నారు. భావోద్వేగ నియంత్రణ ఒక సమతుల్య జీవితానికి పునాది వంటిదన్నారు. మొబైల్ ఫోన్ల వినియోగాన్ని తగ్గించుకుంటూ, తగినంత విశ్రాంతిని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.జయానందకుమార్, డైరెక్టర్లు డాక్టర్ టీవీ ప్రసాద్, డాక్టర్ ఆర్ఎస్ రాజు పాల్గొన్నారు.

## 'రీసెర్చ్ మెథడాలజీ'పై నన్నయలో వర్క్‌షాప్


జ్యోతిని వెలిగించి వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

రాజానగరం: పరిశోధనలు ఎల్లప్పుడూ ఒక ప్రాంతానికి పరిమితం కాకుండా విశ్వజనీనమైన ఆలోచనలతో ఉండాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. యూనివర్సిటీలో కామర్స్ అండ్ మేనేజిమెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో రీసెర్చ్ మెథడాలజీ అనే అంశంపై శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న పులపా సుబ్బారావు మాట్లాడుతూ రామాయణం, మహాభారతం, ఖురాన్, బైబిల్, బౌద్ధ గ్రంథాలపై కూడా అనేక పరిశోధన చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రోగ్రామ్ డైరెక్టర్లు డాక్టర్ ఎస్.ఉదయ్ భాస్కర్, డాక్టర్ పి.ఉమా మహేశ్వరీదేవి ప్రసంగించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రీసర్వే గ్రామసభలను సద్వినియోగించుకోండి


దోమాడ గ్రామసభలో రైతు నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ సీతాపతిరావు

పెదపూడి: రీసర్వే గ్రామ సభలపై రైతులు అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ పీ.వీ.సీతాపతిరావు అన్నారు. దోమాడ గ్రామంలో శనివారం రీసర్వే గ్రామ సభ సర్పంచి మీనవల్లి శారదాదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే రీసర్వే గ్రామ సభలతో భూ సంబంధమైన సమస్యలకు చెక్ పెట్టినట్లు అవుతుందన్నారు. గ్రామ సభలో 59 అర్జీలు అందాయన్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మీనవల్లి సత్తిబాబు, ఎం. దొరబ్బాయి, వీఆర్వోలు పీ. నాగేశ్వరరావు, నాగేంద్ర, సచివాలయం కార్యదర్శి సబ్బెళ్ల కృష్ణారెడ్డి ల్గొన్నారు.

## దేవిన సిస్టర్స్‌కు ఎస్పీ అభినందన


దేవిన కుటుంబ సభ్యులను అభినందిస్తున్న ఎస్సై కృష్ణసాయి

రంగంపేట: రంగంపేట గ్రామానికి చెందిన సైకత శిల్పి దేవిన శ్రీనివాస్ కుమార్తెలు సోహిత, ధన్యత (దేవిన సిస్టర్స్)లను జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ అభినందించినట్టు స్థానిక ఎస్సై తోట కృష్ణసాయి తెలిపారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా రంగంపేటలో దేవిన సిస్టర్స్ పోలీసుల త్యాగాలను తెలియజేస్తూ సైకత శిల్పాన్ని రూపొందించారు. రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుకుంటూ తండ్రి శ్రీనివాస్ వద్ద సైకత శిల్పాలు రూపొందించడంలో వీరిద్దరు ఆరితేరారు. సైకత శిల్పాల ద్వారా ప్రజలను చైతన్య పరుస్తున్న దేవిన సిస్టర్స్‌ను ఎస్పీ అభినందించి జ్ఞాపికను అందించినట్లు చెప్పారు.

## వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు


చంద్రేడులో వేంకటేశ్వరుడు

రంగంపేట: మండల పరిధిలోని చంద్రేడు గ్రామంలో కొలువైన పద్మావతీ, అలమేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

**శ్రీనివాసుడికి పంచామృతాభిషేకాలు**

పెదపూడి: సంపర గ్రామంలో ప్రసిద్ధి చెందిన అలమేలు మంగ సమేత కలియుగ వేంకటేశ్వర స్వామికి శనివారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతా చార్యులు స్వామి వారికి తులసి, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.